క్లుప్తంగా

నర్సాపూర్ కార్యదర్శి సస్పెండ్

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్ పంచాయతీ కార్యదర్శి సునీల్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ డీపీవో రమేశ్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సాపూర్‌లో విచారణ చేపట్టిన కొన్ని గంటలకే కార్యదర్శిని సస్పెండ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నేడు యూరియా పంపిణీ

బేల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి సాయితేజరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 444 యూరియా బ్యాగుల స్టాకు వచ్చిందని, మరో 444 బ్యాగుల స్టాకు శుక్రవారం మధ్యాహ్నం వరకు రానుందని పేర్కొన్నారు. ఒక్కొక్క పట్టాపాస్ బుక్‌కు రెండేసీ చొప్పున యూరియా బ్యాగులు పంపిణీ ఉంటుందని, రైతులు సంయమనం పాటించి బ్యాగులు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

అర్హులైన పేదలకు సీఎంఆర్ఎఫ్

నేరడిగొండ: అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అందుతుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సీఎం సహాయ నిధి పథకం కింద మంజూరైన చెక్కును గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు. బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన శారదకు మంజూరైన రూ.60వేల విలువైన చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీపై జాగ్రత్తగా ఉండాలి

బజార్‌హత్నూర్: టీబీ లక్షణాలు ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్య చికిత్స పొందుతూ టీబీపై జాగ్రత్తగా ఉండాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ సుమలత తెలిపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో చింతల సాంగ్వి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు, టీబీ లక్షణాలు ఉన్న వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో సూర్యప్రకాష్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: బాలల పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరి సహకారం అవసరమని బోథ్ ఎంపీడీవో రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్, డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడిన కమిటీకి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కన్వీనర్‌గా ఉంటారని అన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఏపీవో, ఏపీఎం మండల సమాఖ్య అధ్యక్షుడు, ఎన్జీవో సభ్యులు, కిశోర- బాలికలు సభ్యులుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

సమష్టిగా పనిచేస్తే ఆరోగ్యకరమైన సమాజం

నేరడిగొండ: ఆరోగ్య సిబ్బంది సమష్టిగా పనిచేస్తే సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇందుజ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ శక్తివంతమైన కుటుంబ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 55 మంది మహిళలతో పాటు పిల్లలకు చికిత్స అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నేరడిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం, హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'మా పాఠశాలను సందర్శించండి'



ఏఎస్పీని ఆహ్వానిస్తున్న అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను సందర్శించాలని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల అధ్యాపకులు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను గురువారం ఆహ్వానించారు. ఆరోగ్య జాతర ఛాంపియన్లుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్, బహుమతులు ప్రదానం చేయాలని ప్రధానోపాధ్యాయురాలు శీతల్ చవాన్ తెలిపారు. ఆమె వెంట ఉపాధ్యాయురాలు రవిత, శ్రీవాణి, తదితరులు ఉన్నారు.

రెచ్చిపోతున్న వీధికుక్కలు

- వృద్ధులు, చిన్నపిల్లలపై దాడులు
- నియంత్రణకు చర్యలు శూన్యం
- భయాందోళనలో ప్రజలు



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన పశు పోషకుడు లయరీ కిష్టయ్యకు చెందిన గొర్రెలు, కొట్టంలో ఉన్న గొర్రెలపై వీధి కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేశాయి. 13 గొర్రెలు మృతి చెందగా.. 4 గొర్రెలకు గాయలయ్యాయి. మృతి చెందిన వాటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని పోషకుడు తెలిపాడు.

ఆదిలాబాద్‌రూరల్: వీధి కుక్కల నియంత్రణ లేకపోవడంతో వాటి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. స్వైర విహారం చేస్తూ.. చిన్న పిల్లలతో పాటు పెద్ద వారిపై దాడులు చేస్తున్నాయి. ఏ గల్లీ నుంచి ఏ వీధి కుక్క వచ్చి దాడి చేస్తుందోనని గ్రామీణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా వాహనాలపై వెళ్తున్న వారిపై సైతం కుక్కలు దాడి చేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు.

ఆందోళనలో ప్రజలు..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు కొనసాగుతుండడంతో రైతులు ఉదయమే వ్యవసాయ పనులకు వెళ్లిపోతుంటారు. వారి పిల్లలను ఇంటి వద్ద, పాఠశాలకు వదిలి పెట్టి పోతుంటారు. సాయంత్రం తల్లిదండ్రులు వ్యవసాయ పనులు ముగించుకోని రాక ముందే పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి వస్తుంటారు. ఆ సమయంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో కుక్కలు పిల్లల వెంట పడుతున్నాయని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణ ఏదీ..

మండలంలోని ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు ప్రజలపై దాడి చేసిన క్రమంలో వాటి నియంత్రణకు హడావుడి చేస్తున్న అధికారులు ఆ విషయం మరచిపోయినంతరం వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా మనుషులపై, పశువుల మందపై కుక్కలు దాడి చేసిన సందర్భాలు అనేకం ఉన్నప్పటికీ అవి వెలుగులోకి రావడం లేదు. అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తరలించేందుకు చర్యలు

ఇటీవల మండలంలోని యాపల్‌గూడలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో గ్రామంలోని 120 కుక్కలను తరలించాం. మిగితా గ్రామాల్లో కూడా తరలింపునకు చర్యలు తీసుకుంటున్నాం.

– స్వప్నశీల, ఎంపీడీవో, ఆదిలాబాద్ రూరల్

ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

కైలాస్‌నగర్: భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు నళిని రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. పదివేల ఎకరాలకుపైగా పత్తి, సోయా, ఇతర పంటలు నష్టం జరిగిందన్నారు. అధికారులు వందలా ఎకరాలను సర్వే చేయాల్సి ఉందన్నారు. రైతులకు పత్తికి రూ.15వేలు, సోయాబీన్ క్వింటాల్‌కు రూ.10వేల గిట్టుబాటు ధర చెల్లించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎస్.అరుణ్ కుమార్, కుంటాల రాములు, గణేష్, నర్సింగ్‌రావు, గజారాం, స్వామి పాల్గొన్నారు.

వేతనాల తగ్గింపుపై నిరసన



వినతిపత్రం అందిస్తున్న అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మైనార్టీ జూనియర్ గురుకుల కళాశాల, పాఠశాలల్లో విద్యను బోధిస్తున్న టీజీటీ, పీటీటీ, జేఎల్ అధ్యాపకులు తమ వేతనాల తగ్గింపుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వేతనాలు తగ్గిస్తూ జీవో నెం. 1437 జారీ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో తమ వేతనాల్లో 40 శాతం వరకు కోత పడుతుందని వాపోయారు. ప్రభుత్వం పునరాలోచించి యథావిధిగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కళాశాల, పాఠశాల అధ్యాపకులు మజర్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నేరడిగొండ: విద్యార్థినులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని కుంటాల(కె) వసతి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత, ఏఎన్‌ఎం జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్, ప్రధానోపాధ్యాయుడు అంబారావ్, హాస్టల్ ఏఎన్‌ఎం అశ్విని పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలని నిరసన



బతుకమ్మతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: ఆరు గ్యారంటీలు అమలు చేయాలని గురువారం ముఖరా(కె) గ్రామస్తులు ప్లకార్డులతో బతుకమ్మను తయారు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ.. మహిలక్ష్మి పథకం, 4 వేల ఫించన్, కల్యాణలక్ష్మికి తులం బంగారం, ఆడ పిల్లలకు స్కూటీలు ఇవ్వాలన్నారు. మహిళలను, ఆడపడుచులను, వృద్ధులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సూభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఇచ్చోడ: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జాదవ్ రమేశ్, ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతువేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ప్రజావాణిలో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి భగత్ రమేశ్, ఏఈవో సంజీవ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

ఆదిలాబాద్‌టౌన్: పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఖమాట్లాడారు. పత్తి క్వింటాలుకు రూ.15 వేలు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. సోయా పంట క్వింటాలుకు రూ.10వేలు చెల్లించాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సమావేశంలో అరుణ్ కుమార్, గణేష్, నర్సింగ్‌రావు, గజ్జారాం, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: పిట్స్‌తో రిమ్స్ ఆసుపత్రిలో చేరిన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డొంగ్రె చందును ఆ సంఘం నాయకులు గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. యూనియన్ తరపున అండగా ఉంటామని భరోసానిచ్చారు. సిర్రా దేవేందర్, ముజీబ్, లక్ష్మి, డేవిడ్, సంగీత, ఖాసీం ఉన్నారు.

కంటి వైద్య శిబిరం

బజార్‌హత్నూర్: స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం రిమ్స్ కంటి వైద్య నిపుణులు ప్రొఫెసర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా 15 మందికి కంటి అద్దాలు, ముగ్గురికి కంటి ఆపరేషన్ అవసరమని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు భీంరావ్, అలేఖ్య, వైద్య సిబ్బంది భాస్కర్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండలం ఇన్‌చార్జిగా రాంప్రసాద్

ఉట్నూర్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన దాసరి రాంప్రసాద్ మాదిగను ఉట్నూర్ మండల ఇన్‌చార్జిగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ తెలిపారు. ఉట్నూర్ మండల పరిధిలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

బిర్యానీ హౌజ్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో గల బిర్యానీ హౌజ్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో షాపు యజమాని రాజారాం తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం 5 గంటల ప్రాంతంలో తిరిగి వచ్చి చూడగా షాపు తాళం పగలగొట్టి ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.200 నగదు అపహరించినట్లు బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

నిధులు విడుదల చేయాలని లేఖ

బోథ్: ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవల బోథ్ నియోజకవర్గ కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతన్నతో పాటు పలువురు సభ్యులు తమ ప్రాంతంలోని సమస్యలను మంత్రికి విన్నవించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు బోథ్ ప్రాంతంలో ఆరోగ్య, విద్యారంగాలు సహా అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర రాజ నరసింహకు లేఖ రాశారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఉట్నూర్‌రూరల్: సంగారెడ్డి జిల్లా అందోల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లికిలో బార్బర్ షాప్ యజమాని తల్లిదండ్రులపై దాడి చేసిన ఉపేందర్‌పై చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ నాయీబ్రాహ్మణ సంఘం డివిజన్ అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్ డిమాండ్ చేశారు. వృత్తిని నమ్ముకొని నిరుపేద బతుకులు బతుకుతున్న నాయీబ్రాహ్మణులపై దాడులు చేయడం సరికాదన్నారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో వైద్యుల కొరతతో పాటు, సౌకర్యాలు లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవల కోసం మరో నూతన భవనం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయించామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ వైస్ ఎంపీపీ స్వామి, శ్రీధర్ రెడ్డి, నారాయణ రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.24 లక్షల 36 వేల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం అందజేశారు. ఆయా మండలలాలకు చెందిన 105 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

పరామర్శ

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండల కేంద్రంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన ఫెరోజ్ ఖాన్, బీఆర్ఎస్ నాయకుడు వినయ్ సోదరుడిని, పరామర్శించారు. గ్రామ పంచాయతీ కార్మికుడు గంగయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, శ్రీధర్ రెడ్డి, నారాయణ రెడ్డి, సురేందర్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నేరడిగొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని బుగ్గారం(బి) గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు హ్యాండ్‌బాల్ పోటీల కోసం గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌కు బయలుదేరే ముందు ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే వారి వసతి ఖర్చుల కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రాథోడ్ సురేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలతో విసుగెత్తిన యువత

ఇచ్చోడ: కాంగ్రెస్ మోసాలకు యువత విసుగెత్తిపోయారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని గేర్జం గ్రామానికి చెందిన పలువురు యువత బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు వెంకటేశ్, మనోహర్, రవీ, గోవర్ధన్ పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై సాయన్న

ఇంద్రవెల్లి: అన్ని పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై సాయన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, మారుతి డొంగ్రె, మోరే దిలీప్, మసుద్, సుఫీయన్, తహరే గణేష్, ఆరేల్లి రాజలింగు, కైలాస్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో గురువారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెదురు చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మేదర మహేంద్ర సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పిల్లి నరేశ్ మాట్లాడుతూ.. అడవిలో నుంచి వెదురు బొంగులను తీసుకువచ్చి కులవృత్తి చేసే మేదరులకు మార్కెట్లోకి ప్లాస్టిక్ వచ్చి కులవృత్తులను కనుమరుగు చేసిందన్నారు. కులవృత్తులకు గిట్టుబాటు ధరలు లేక బతుకుదెరువు గగనమైపోతుదంన్నారు. ప్రభుత్వం ఆదుకునే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. మేదర కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఫెడరేషన్ నిధుల ద్వారా మేదర కులవృత్తులు చేసుకునే వారికి నెలకు రూ. 6 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని మేదర కులాల వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆదిలాబాద్: మేదర కుల వృత్తిదారులకు ప్రభుత్వమే ఉచితంగా వెదురు అందించాలని మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి కిషన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రపంచ వెదురు దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో అరికట్టి, వెదురు వస్తువులు వాడాలని కోరారు. అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఊరే దినేష్, ఊరే గణేష్, సూర్య, దశరథ్, జగదీష్, మహిపాల్, ఆడెల్లు, రాజశేఖర్, మహేశ్, చంద్రశేఖర్, విజయ్, రాజు, ధర్మన్న పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో మహేంద్ర సంఘ భవనంలో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ మండల అధ్యక్షుడు వేముల శంకర్ మాట్లాడుతూ.. మహేంద్రులు వెదురుతో వివిధ రకాల వస్తువులు తయారు చేసుకుని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో తమ జీవనోపాధిని పొందుతారని తెలిపారు. ప్రస్తుతం టైగర్ జోన్ కారణంగా అడవిలోకి వెళ్లి వెదురు తీసుకుని వచ్చే పరిస్థితి లేదన్నారు. మహేంద్రలకు అడవికి వెళ్లి వెదురు సేకరించేందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘ సభ్యులు రవీందర్, మహేశ్, ఒరే రాజశేఖర్, తిరుపతి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మల అభ్యున్నతికి కేంద్రం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: విశ్వకర్మల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠంలో విశ్వకర్మ మరాఠీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో గురువారం పాల్గొన్నారు. విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. నైపుణ్యం గల విశ్వకర్మలందరికీ రుణాలు అందించేందుకు హామీ ఇచ్చారు. అనంతరం విశ్వకర్మలంతా విశ్వకర్మ విగ్రహంతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.

గొర్ల కాపరుల సమస్యల పరిష్కారానికి కృషి

గొర్ల కాపర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన గొర్ల కాపరుల సంఘం ప్రతినిధులు గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

పోకిరీలు వేధిస్తే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం

ఆదిలాబాద్‌టౌన్: యువతులు, మహిళలను పోకిరీలు వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలని షీటీం ఇన్‌చార్జి సుశీల అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అవసరాన్ని బట్టి వినియోగించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో ఇన్‌స్టాగామ్, టెలీగ్రామ్, వాట్సాప్, స్నాప్‌చార్ట్‌లలో చాటింగ్ చేయవద్దన్నారు. ఫొటోలు, వీడియోలను పంపడం వంటివి చేయవద్దన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, మహిళ కానిస్టేబుల్ వాణిశ్రీ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సభ్యులు స్వప్న, మోహన్, రోహిని, రేఖ, అనిత, సోని, పూనం, తన్వీర్, చంద్రకాంత్, నరేశ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

'కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి'



ఆందోళన చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఔట్‌సోర్సింగ్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. గురువారం సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు పలికారు. కనీస వేతనాలు చెల్లించకుండా అరకొర వేతనాలను నెలల తరబడి చెల్లించకుండా కార్మికులను పస్తులు ఉంటున్నారని, పెండింగ్ వేతనాలను ఖాతాలో జమ చేయాలన్నారు. జీవో 64ను వెంటనే రద్దు చేయాలి. కనీస వేతనాలు జీవోను జిల్లా కలెక్టర్ ద్వారా గెజిట్ చేసి రూపాయలు రూ. 26,000ల వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా నాయకులు ఆత్రం సోనేరావ్, సుందర్, వెంకట్రావు, బాపురావ్, మాణిక్ రావు పాల్గొన్నారు.